


# సారీ జాఫర్

ఓల్గా

ఆదివారం ఉదయం పేపర్ అమూలాగ్రం చదవకపోతే ఇక ఆరోజు ఏదీ ఆనందించలేడు రామారావు. ఆలస్యంగా నిద్రలేవటం పేపరంతా చదవటం ఈ రెండే రామారావుకి విలాసాలు. వాటిని కూడా భరించలేదు పార్వతి.

"బజారుకెళ్లిరా. తర్వాత చదువుదువుగానీ, మాంసం దుకాణంలో మంచి లేతదంతా అందరూ కొనుక్కుపొయ్యేదాకా ఆ పేపర్ వదలవు. ప్రతిసారీ ఆ ముదురుది ఒండలేక, తినలేకా చస్తున్నాం."

పేపర్ చదువుతున్నంతసేపూ వంటింట్లోంచి ఆ నేపథ్య సంగీతం కూడా రామారావుకి అలవాటే.

పేపరంతా చదివి నగరంలో ఈనాడు దగ్గరికి వచ్చాడు. ఏవో సభలు, సమావేశాల సమాచారం. అవి కూడా ఒదలడు.

"యుద్ధ వ్యతిరేక ప్రదర్శన, టాంక్‌బండ్ మీద."

'వెళ్తే బాగుండు'

అలా ఈమధ్య ప్రతిరోజూ ఏదో ఒకదాని గురించి అనుకుంటూనే ఉన్నాడు. కానీ ఏదో వెనక్కు లాగుతుంది.

ఇప్పుడా! పాతిక సంవత్సరాల నుంచీ అంతే. పిల్లలు పుట్టకముందు నయం. పుస్తకాలు చదివేవాడు. ఎప్పుడన్నా సభలకూ, సమావేశాలకూ వెళ్లేవాడు. పిల్లలిద్దరూ పుట్టాక ఇక అసలు తీరికలేదు రామారావుకి. అంతా వాళ్లే లాగేసుకున్నారు.

తన ఇద్దరు కొడుకుల్నీ చూసుకుని వాళ్ల కోసమూ తన కోసమూ కూడా గర్వపడతాడు రామారావు. పెద్దకొడుకు మూడేళ్ల క్రితం ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని అమెరికా వెళ్లిపోయాడు. సంవత్సరం క్రితం వచ్చి పెళ్లి చేసుకుని భార్యను కూడా తీసుకెళ్లాడు. రెండో కొడుకు ఇంజనీరింగ్ చివరి సంవత్సరం. ఆరు నెలల్లో అతనూ అన్న దారే పడతాడు. వాళ్లీ దశకు రావటానికి రామారావూ పార్వతీ పడిన కష్టం అంతా ఇంతా కాదు.

రామారావు ఎస్.ఎస్.ఎల్.సి.తో చదువు ఆపేసినా కొడుకుల్ని కోరిన చదువు చదివించాడు. దానికోసం తన ఇష్టాలూ, కోరికలూ అన్నీ త్యాగం చేశాడు. కొన్ని సంవత్సరాలపాటు ఉదయం ఏడింటి నుంచీ రాత్రి పదింటి వరకూ విశ్రాంతి లేకుండా పనిచేశాడు. చేసే ఉద్యోగం కాక పది చిన్న ఉద్యోగాలు చేశాడు. పార్వతి కూడా ఒక ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేసింది. కొడుకులకు ఏ లోటూ రాకూడదు. ఇద్దరి ధ్యేయమూ ఒకటే.

పిల్లలిద్దరికీ మంచి భోజనం, కోరిన బట్టలు, నగరంలోకెల్లా మంచి విద్యాలయాల్లో సీట్లు.

పెద్దకొడుకు అమెరికా వెళ్లాక కాస్త ఊపిరి పీల్చుకున్నారు. పార్వతి ఉద్యోగం మానేసింది. చిన్న కొడుకు కూడా అమెరికా వెళ్లాక తనూ వి.ఆర్.ఎస్. తీసుకుందామని చూస్తున్నాడు రామారావు.

ఇన్నాళ్ల తర్వాత చుట్టూ చూస్తే ప్రపంచం చాలా మారినట్లుంది. చిన్నప్పుడు తను చదివిన పుస్తకాలన్నీ పాతవైనట్లు. తన ఆఫీసులో కొత్తగా చేరిన యువకుడొకడు. అయినా అతనొచ్చి ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటాడు. 'ఆ సాగర్ ఇవాళ ఈ యుద్ధవ్యతిరేక ప్రదర్శనకు వెళ్తాడు,' అనుకున్నాడు రామారావు.

'సరే మన చేతుల్తో మనం చెడు చేయటంలేదు. అదే గొప్ప సంగతి ఈ పాడు ప్రపంచంలో. మంచి చేసే

అవకాశం ఉంటే చేస్తాం. లేకపోతే లేదు,' అనుకుంటూ తన ఆత్మను శాంతింపజేసుకుంటూ ఉండగా పార్వతి వచ్చి చేతిలో పేపర్ లాగేసింది.

రామారావు లేచి వెళ్లబోతుండగా ఫోన్ మోగింది. వంటింట్లోకి వెళ్లబోతున్న పార్వతి నెత్తి కొట్టుకుంది. ఆ ఫోన్ త్వరగా ముగించమని సైగలతో చెప్పే ప్రయత్నం చేస్తూ ఎదురుగా నుంచుంది.

రామారావు ముఖం క్రమంగా సంతోషంతో ఎరుపెక్కి విశాలం కావటం చూసి సైగలు ఆపింది.

"జాఫరాలీ వస్తున్నాడు, వాళ్లమ్మాయితో. ఇక్కడ ఉద్యోగమయిందట," ముక్కలు ముక్కలుగా సంతోషాన్ని పంచాడు.

"ఎప్పటి జాఫరాలీ. ఇప్పుడు జ్ఞాపకం ఒచ్చాడటనా?" పార్వతి కూడా సంతోషపడింది.

రామారావు మనసులో ఆనందం ఊటబావి లోంచి నీరూరినట్లు ఊరుతోంది. పదిహేనేళ్ల పైనే అయింది జాఫరాలీని చూసి. కరీంనగర్‌కీ, హైదరాబాద్‌కీ మధ్య దూరం రెండొందల మైళ్లు అనుకుంటాం గానీ పదిహేనేళ్ల పైగా ఉంది అనుకున్నాడు.

'రేపు ఉదయం ఒస్తున్నాడు. వాళ్లమ్మాయి నసీమాకు ఇక్కడే ఉద్యోగం దొరికిందట. ఇవాళ మాంసం ఒండొద్దు. రేపు చికెన్, మటన్ బిర్యానీ- నీ ఇష్టం. ఏమేం సరుకులు కావాలో చెప్పు. ఇవాళే తెచ్చేస్తా," ఉత్సాహంతో పొంగిపోతున్నాడు రామారావు.

*

రామారావు పదిహేడేళ్ల వయసులో హైదరాబాద్ వచ్చాడు. ఆ తారీకు కూడా అతనికి బాగా గుర్తు. 1964 నవంబర్ నాలుగో తారీకున రైలు దిగాడు. ఉద్యోగం వెతుక్కుంటూ ఆరునెలలు హైదరాబాదంతా చెడ తిరిగాడు. ఉద్యోగం వెతుక్కుంటూ అనటం కంటే హైదరాబాద్‌ను కనుగొంటూ అనటం సరిగా ఉంటుందేమో. తెనాలి పక్కనున్న పల్లెటూరి నుంచి వచ్చిన అతనికి హైదరాబాద్‌లో అంతా వింతే. అందువల్లే బస్సు కూడా ఎక్కకుండా హైదరాబాద్ సందుగొందులన్నీ సర్వే చేసే ఉద్యోగాన్ని ఎవ్వరూ ఇవ్వకుండానే దిగ్విజయంగా చేశాడు.

అదుగో అప్పుడే జాఫరాలీ పరిచయమయ్యాడు. ఆరోజుల్లో రామారావుకి ప్రతి ఆదివారం అబిడ్స్ వెళ్లటానికే తెల్లవారేది. ఆబిడ్స్‌లో ఆదివారం పెద్ద ఎత్తున జరిగే పాత పుస్తకాల అమ్మకాల మహోత్సవం. ఔను. అది రామారావుకి ఉత్సవంలాగే ఉండేది.

ఆ ఉత్సవపు ఊరేగింపులో తనను తానొక రాజకుమారుడిగా భావించుకుంటూ నడిచేవాడు. పుస్తకాల పేర్లు చదవటమే ఆనందంగా ఉండేది. వాటిని తాకుతుంటే ఇక చెప్పనక్కర్లేదు. స్వంతం చేసుకున్నాడా పెద్ద నిధి దొరికినట్లే. సాయంత్రం వరకూ అక్కడే ఆ వీధుల్లోనే సర్వం మరిచిపోయి తిరిగేవాడు. దొరకని ఉద్యోగపు చింత దొరికిన పుస్తకంతో తీరిపోయేది. పాత పుస్తకం పట్టుకుని ఒస్తున్న రామారావుని చూసి అప్పాయింట్‌మెంట్ ఆర్డరుతో ఒస్తున్నాడనుకునేవాడు రామారావు మేనమామ. వాళ్లింట్లో ఉండే ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు.

అలా అబిడ్స్ వీధుల్లో నడుస్తున్న రామారావు 1965 ఫిబ్రవరి 26వ తారీకున హఠాత్తుగా ఒకచోట ఆగిపోయాడు. పాత పుస్తకాల దుకాణమే అది. అక్కడొక పుస్తకం చేతులెత్తి పిలుస్తోంది. కళ్లు మెరుస్తుండగా ఆ పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. 'అమీనా-గుడిపాటి వెంకటచలం' అట్టమీది అక్షరాలను ఆప్యాయంగా తడిమాడు.

ఈ పుస్తకం గురించి అతని మిత్రుడొకడు తెగ చెప్పాడు. ఆ పుస్తకం చదవకుండా చలం రచనలెన్ని చదివినా వృథా అన్నాడు. చదవలేదని రామారావు పశ్చాత్తాపపడుతున్న కొద్దీ రెచ్చిపోయి అమీనాను ఆకాశానికి ఎత్తాడు. ఇప్పుడు ఆకాశం నుంచి చందమామ దిగివచ్చి చేతుల్లో వాలితే ఎట్లా ఉంటుందో అట్లా వుంది రామారావుకి.

ఈ పుస్తకం కొనక తప్పదు. జేబులో పావలా బైటికురకటానికి తొందరపడుతోంది.

"ఈ పుస్తకం ఎంత," ముందు అలవాటుగా తెలుగులో అడిగి నాలుక కరుచుకుని హిందీలో అడగటానికి మాటలు కూడదీసుకుంటుండగా దుకాణంలో యువకుడు, "ఆఠణా," అన్నాడు.

"చారనాకివొచ్చు. చిన్న పుస్తకమేగా," అన్నాడు. బేరాలు చెయ్యటం రామారావుకి బాగానే వచ్చు.

"చిన్నపుస్తకమా? చలం, వెంకటచలం. తెనాలి, బెజవాడ వెళ్లి అడుగు తెలుస్తుంది. వెంకటచలం పేరు విన్నావా? ఆ చలం పుస్తకం అది. చిన్న పుస్తకం, పెద్ద పుస్తకం అంటూ మాట్లాడకు," గద్దించాడా యువకుడు.

ఆ యువకుడికి తెలుగు తెలియటమే కాకుండా చలం తెలిసినందుకు రామారావు పొంగిపోయాడు. జేబులోంచి రెండు నాణాలూ తీసి, "ఇంతే ఉంది. వుంటే రెండు రూపాయలైనా ఇచ్చేవాడిని. చలం

పుస్తకాలు చాలా ఉన్నాయి నా దగ్గర. ఇది లేదు. ఒద ల్లేక అడిగా.'' అప్పుడు పరేషాన్ అవటం ఆ యువకుడి వంతయింది.

''సరే తీస్కో,'' అంటూ అందించాడు. పావలానే తీసుకున్నాడు.

''నీ పేరేంటి?'' అడిగాడు రామారావు.

''జాఫరాలీ.''

ఒకరి గురించి ఒకరు తెలుసుకున్న ఆ ఘడియ ఎలాంటిదోగానీ ఇక ప్రతాదివారమూ జాఫరాలీ, రామారావు కలవటం తప్పలేదు. ఉర్దూ అక్షరమ్ముక్క రాని రామారావుకి జాఫరాలీ ఉర్దూ నేర్పాడు. జాఫరాలీకి ఒచ్చిన తెలుగుకి రామారావు మెరుగులు దిద్దాడు. ఉర్దూ కవిత్వం చదవకపోతే బతకటం దండగ అని జాఫరాలీ- శ్రీశ్రీ, చలాన్ని చదవకపోతే జాఫరాలి హుస్సేన్‌సాగర్‌లో పడి చచ్చిపోవచ్చని రామారావూ బీరాలు పలుక్కున్నారు. ఇద్దరూ బతకాలనే తీర్మానించుకుని బతికారు. ఒక ఆదివారం రాత్రి రామారావు జాఫరాలీ వెంట వాళ్లింటికి వెళ్లాడు. వాళ్ల నాన్న మంచాన పడి ఉన్నాడు. అమ్మ ఆరోగ్యంగానే ఉండి ఇంటిభారమంతా మోస్తోంది. వాళ్ల వివరాలన్నీ షషతాజీ బేగమే చెప్పింది. ఖమ్మం నుంచి దాదాపు ఇరవై ఏళ్ల క్రితం హైదరాబాద్ ఒచ్చిన కుటుంబం వాళ్లది. యూనియన్ సైన్యాలొచ్చిన ఏడాదికి వచ్చామని మధ్యలో కల్పించుకుని చెప్పాడు తండ్రి. ఆయన పాత పుస్తకాల వ్యాపారం చిన్నగా మొదలెట్టి పెద్దది చేసి మంచాన పడ్డాడు. నలుగురక్కల తర్వాత పుట్టిన జాఫరాలీ అంటే వాళ్లకు ప్రాణం అని జాఫరాలీ వంక వాళ్లు చూసే చూపుల్లోనే అర్థమవుతుంది. నలుగు రక్కలకూ పెళ్లిళ్లయ్యాయి. వాళ్లు ఖమ్మం, వరంగల్లు జిల్లాల్లో ఉంటున్నారు. జాఫరాలీకి ఇక్కడ పెద్ద బంధు బలగం కూడా లేదు.

జాఫరాలీ వాళ్లమ్మ ఒండిన మాంసం కూర రుచి రామారావు అంతకు ముందెరగడు. ప్రతాదివారం భోజనానికి వస్తానని చెప్పాడు. నిజంగానే రెండేళ్లపాటు ప్రతాదివారం వెళ్లాడు. రంజాన్ సమయంలో చెప్పనే అక్కర్లేదు. తిన్నంత హలీమ్.

ఇద్దరూ కడుపునిండా తిని వాళ్లింటి వెనకున్న జానెడు చోట్లో సర్దుకునేవారు. ఆకాశం కింద పడుకుని నక్షత్రాలు చూస్తూ పాటలు పాడుకునేవాళ్లు.

యవ్వనం, కవిత్వం, చందమామ, నక్షత్రాలు కావాల్సిందేమిటి? ఏ రెండింటి దాకానో తెలుగు, హిందీ సినిమాపాటలూ, ఉర్దూ గజల్స్, తెలుగు కవిత్వమూ పాడుకునీ పాడుకునీ అలసి నిద్రపోయేవాళ్లు. 1970లో రామారావుకి పెళ్లయ్యేదాకా ఇదే వరస. ఆ తర్వాత ఆదివారం రాత్రులు కట్ అయ్యాయి. తర్వాత రెండేళ్లకు జాఫరాలీకి పెళ్లయింది.

పార్వతీ, ఫాతీమా కూడా స్నేహితులయ్యారు. పెళ్లయ్యాక స్నేహితులిద్దరికీ బాధ్యతలు పెరిగాయి. రామారావు ఉద్యోగంలో ప్రమోషన్ల కోసం ప్రైవేటుగా డిగ్రీ చదవటం, డిపార్ట్‌మెంట్ పరీక్షలు రాయటం వీటిలో పడితే జాఫర్ వ్యాపారాన్ని పెంచే పనిలోపడ్డాడు. ఇద్దరికీ పిల్లలు పుట్టుకొచ్చారు. వాళ్ల చదువులూ, సంధ్యలూ, పెద్దవాళ్ల జబ్బులు, మందులు, ఆస్పత్రులూ, మరణాలు. కాలం పరిగెత్తుతూపోయింది.

మధ్య మధ్యలో మిత్రులను కలపటానికి రంజాను, బక్రీదు, దసరా, దీపావళీ వచ్చి పోతుండేవి.

జాఫరాలీకి నలుగురు ఆడపిల్లలు. రామారావు ఉద్యోగంలో పైకి పోతున్నాడు. జాఫరాలీ వ్యాపారం కుంగిపోతోంది. రామారావుని ఏనాడు అప్పడగని జాఫర్ అతనికి పెద్ద సాయం చేశాడు. మెహిదీపట్నంలో తనకు తెలిసినవాళ్లు తమ ఇంటిని కారుచౌకగా అమ్ముతుంటే అది రామారావు కొనేలా చేశాడు. అదే సమయంలో తన చిన్న ఇల్లు అమ్ముకుని అద్దె ఇంట్లోకి మారాడు.

కలిసిరాని వ్యాపారం ఒదిలేసి, హైదరాబాద్ ఒదిలేసి, కరీంనగర్‌లో తన బావ పెట్టే ఫర్నీచర్ షాపులో భాగం కలిసి వెళ్లిపోయాడు. అక్కడికి వెళ్లే ముందు జాఫర్ కుటుంబాన్ని పిల్చి మంచి విందు చేశాడు రామారావు. చాలారోజుల తర్వాత స్నేహితులిద్దరూ డాబా మీద చేరి పాతరోజులు నెమరేసుకుంటూ, పాత పాటలు పాడుకుంటూ గడిపారు. ఫాతిమా, పార్వతులను మీవల్లే మా పాటలూ ఆగిపోయాయని సరదాగా నిందించారు.

నిద్రపోతున్న పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించారు. జాఫరాలీ కరీంనగర్ వెళ్లాక ఇక వెనక్కు తిరిగి చూడలేదు. కాగితాలతో కలిసిరాని అదృష్టం కలప ముక్కలతో వచ్చింది. ఇల్లు కట్టాడు. ముగ్గురాడపిల్లల పెళ్లిళ్లు చేశాడు. నాలుగో అమ్మాయి నసీమాను మాత్రం చదివించాడు.

ఆ అమ్మాయి బి.కాం పాసై బ్యాంకు పరీక్షలు రాసి చిన్న ఉద్యోగం సంపాదించుకుంది. నసీమాను ఉద్యోగంలో చేర్చటానికి ఇరవై ఏళ్ల తర్వాత రామారావు దగ్గరికి వస్తున్నాడు జాఫరాలీ.

ఆదివారం అంతా పార్వతీ రామారావులు జాఫరాలీ గురించే మాట్లాడుకున్నారు. ముఖ్యంగా తమ ప్రేమ వివాహానికి పెద్దలను ఒప్పించి రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లి చేయించటంలో జాఫరాలీ చూపిన చాకచక్యాన్ని తల్చుకుని సంతోషించారు. సోమవారం ఉదయాన్నే జాఫరాలీ రానే వచ్చాడు. నల్లని బురఖాలో తెల్లని చంద్రబింబంలా నసీమా కూడా ఒచ్చింది. కుశల ప్రశ్నలయ్యాక పార్వతి వంటలో పడింది. ఉదయం ఫలహారానికి గారెలు, కోడికూరా తయారవుతున్నాయి. ఇంతలో రెండో కొడుకు వినయ్ గబగబా వచ్చాడు. ''అమ్మా! వాళ్లెవరూ? మనింటికెందుకొచ్చారు?'' అంటూ, అతని ముఖంలో ఏదో చికాకు.

''జాఫర్ మామయ్యరా. మర్చిపోయావు. చిన్నప్పుడు నీకు మాంసంలో ఎముకల్లోంచి గుజ్జెలా తియ్యాలో నేర్పాడే ఆ మామయ్య'' పార్వతి హుషారుగా చెప్పింది. వినయ్ ముఖం చిట్లించాడు.

''మర్చిపొయ్యావు. నువ్వప్పుడు చిన్న వెధవ్వి. ఐదారేళ్లుంటాయేమో. ఆ తర్వాత వాళ్లు కరీంనగర్ వెళ్లిపోయారు''

''సరే, ఇప్పుడెందుకు వచ్చారు?''

''అదేంట్రా ఎందుకొచ్చారేంటి. ఇన్నాళ్లకొచ్చారు. నసీమాకు ఉద్యోగం. మన పక్క వీధిలో ఉన్న బ్యాంకులో చేర్చటానికి జాఫర్ మామయ్య వచ్చాడు,'' కొడుకు తీరు అర్థంకాక కాస్త అయోమయంగా చూసింది పార్వతి.

''ఈ హైదరాబాద్‌లో వాళ్లకు ముస్లిం బంధువులుగానీ, స్నేహితులుగానీ లేరా? మనింటి కెందుకొచ్చారు?''

పార్వతికి నోటమాట రాలేదు. కొడుకు ఉద్దేశం అర్థం కానూ లేదు.

''ఇప్పుడు మనింటికొస్తే నీకేమైంది?''

''నాకిష్టంలేదు. ముస్లింలు మనింట్లో ఉండటమేంటి?''

కొడుకు ముఖం వంక ఆశ్చర్యంతో చూసింది.

''ఎన్నాళ్లుంటారు?''

''ఏమో,'' బలహీనంగా అంది.

''తొందరగా పంపించండి. మా ఫ్రెండ్స్ చూస్తే బాగుండదు. అయినా నాన్నకు ముస్లిం స్నేహితులేమిటి?'' విసురుగా వెళ్లిపోయాడు. పార్వతికి లోపల్నించి పెద్ద దడ పుట్టుకొచ్చింది. అప్పటికప్పుడు రామారావుతో ఈ సంగతి చెప్పాలనిపించిందిగానీ ఎలాగో అణచుకొని గారెలు ఒండటంలో పడింది.

ఫలహారలయ్యాక జాఫరాలీ, నసీమా బ్యాంకుకు వెళ్లారు.

రామారావు ఒస్తానంటే ఒద్దన్నారు.

రామారావు ఆరోజు శలవు పెట్టాడు. ఫలహారం బరువై మత్తుగా ఉంది. కళ్లు మూతలు పడుతుండగా పార్వతి ఎప్పుడు రామారావు ఒంటరిగా చిక్కుతాడా అని చూస్తుందేమో హడావుడిగా వచ్చింది.

''మనవాడేమంటున్నాడో తెలుసా?''

''లేదే.''

''నాతో వాళ్లిద్దర్నీ తొందరగా పంపించెయ్యండి. ముస్లింలంటే నాకిష్టంలేదు. నాన్నకీ ముస్లిం స్నేహితులేంటి అన్నాడు,'' పార్వతి గబగబా చెప్పేసి బరువు దించుకుంది.

రామారావుకి ఓ క్షణం ఏమీ అర్థంకాలేదు. అర్థమయ్యాక గుండె దడదడలాడింది. ఆ దడ తగ్గించుకుంటూ, ''ఏడ్చాడు వెధవ,'' అన్నాడు.

''అదేంటి వాడలా ఎందుకన్నాడు,'' పార్వతి అశాంతి తగ్గటంలేదు.

''ఒళ్లు పొగరెక్కి.''

''వాడికి ముస్లిమంటే పడదెందుకు? క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌వాళ్లను ఎంత బాగా ఆడినా తిడతాడు,'' పార్వతి కొడుకు నేపథ్యాన్ని ఇప్పటి ప్రవర్తనతో పోల్చి చూసుకుంటుంది.

రామారావుకి పడదుగానీ పార్వతికి క్రికెట్ అంటే ఆసక్తే. కొడుకుల్తో కలిసి చూస్తుంది. ఆటగాళ్లందర్లోకీ ఆవిడకు వసీం అక్రం అంటే ఇష్టం. ఆవిడ ఆ ముక్క బహిరంగంగా అన్న రోజున వినయ్ పెద్ద యుద్ధమే చేశాడు. తల్లి తన అభిమానాన్ని మార్చుకోవాల్సిందేనని పట్టుబట్టాడు.

''ఏమోరా నాకిష్టం. బాగా ఆడతాడు. పైగా అమీర్‌లా ఉంటాడు,'' అంది పార్వతి.

''అమీరా? అతనెవరూ? అమీర్‌ఖానా?'' తనకు తెలియని వ్యక్తి తల్లికి తెలియటం, పైగా ఇష్టమవటం, అతనిలా ఉంటాడని వసీం అక్రంను ఇష్టపడటం- వినయ్‌కి వెర్రెత్తింది.

''అమీరంటే మైదానంలో హీరోలే. మైదానమంటే చలం నవల.''

తల్లికున్న పుస్తకాల పిచ్చ వినయ్‌కి తెలుసు. అతనికి తెలుగురాదు. మంచి చదువు కోసం తెలుగు చెప్పని బళ్లలో చదివించారు. తనకు తెలిసే అవకాశం కూడా లేని ఆ అమీర్‌నేం చెయ్యాలో తెలియక పళ్లు

నూరుకుని ఊరుకున్నాడు. కానీ ఆ విషయంలో తల్లీ కొడుకులిద్దరూ గొడవపడేవాళ్లే. పార్వతి దాన్ని సరదాగా తీసుకునేది. అదేదో క్రికెట్ పిచ్చ అనుకుందిగానీ తన కొడుక్కి మతపిచ్చ అనుకోలేదు.

దేశంలో పెచ్చు పెరుగుతున్న మతోన్మాదం సరాసరి తన ఇంట్లోకే వచ్చి తిష్ట వేస్తుందని రామారావు ఒక్కనాటికీ అనుకోలేదు. కొడుకు మనసు ఎట్లా పని చేస్తోందో ఇన్నాళ్లుగా కనుక్కోలేకపోయినందుకు ఆయనలో ఆందోళన మొదలయింది. ఆ ఆందోళనలో ఉండగానే జాఫరాలీ వచ్చాడు. నసీమా డ్యూటీలో చేరిపోయింది. జాఫరాలీని చూస్తే రామారావుకి ప్రేమ పొంగింది. కొడుకు మీద కోపం పెరిగింది. సాయంత్రం జాఫరాలీకీ కొడుక్కీ స్నేహం కుదిర్చి వీడి విముఖత పోగొట్టాలనుకున్నాడు. చిన్న వెధవ. ఏ చెడు సావాసాలో పట్టి ఉంటాడు. మరీ ఈ క్రికెట్టు జనాల్ని పాడుచేస్తోంది అనుకుని ఆ విషయం అంతటితో ఒదిలేశాడు. జాఫరాలీతో మంచీచెడ్డా మాట్లాడుతూ కూచుని భోజనాలు కానిచ్చారు. ఇద్దరూ నిద్రపోయి లేచేసరికి నసీమా వచ్చేసింది. పార్వతితో గలగలా కబుర్లు చెబుతోంది. ఇంట్లో ఆడపిల్ల ఉంటే ఎంతైనా ఆ కళే వేరు అని ఆ వయసు ఆడపిల్లలెవరొచ్చినా రామారావు సంతోషపడతాడు. అలాగే సంతోషపడుతుండగా వినయ్ ఒచ్చాడు. కొడుకుని చూసి బిత్తరపోయాడు రామారావు. నుదుటి మీద ఎర్రగా ఇంత బారున కుంకుమబొట్టు.

''అదేంటి ఆ వేషం,'' అన్నాడు చిరాగ్గా.

''నా ఇష్టం నాకిది బాగుంది,'' అన్నాడు వినయ్ విసురుగా. రామారావుకి ఏం అనాలో తెలియలేదు. ఎదురుగా జాఫరాలీ.

''మీ జాఫర్ మామయ్యరా. చిన్నప్పుడు నిన్నెత్తుకు మోశాడు.'' వినయ్ జాఫర్ వంక చూసి తలాడించి గదిలోకి వెళ్లిపోయాడు. రాత్రి భోజనాల్లో కొడుకు తమతో కూర్చోనందుకు రామారావు నొచ్చుకున్నాడు.

రాత్రి అందరూ డాబా మీద చేరారు వినయ్ తప్ప. ఎంత పిల్చినా వినయ్ రాలేదు. నసీమా, పార్వతులు నిద్ర వస్తుందని కిందికి దిగి వెళ్లాక రామారావు జాఫర్‌తో తన మనసులో మాట చెప్పాడు.

''మావాడు బాగా చెడిపోయినట్లున్నాడురా. మీరు మా ఇంటికి రావటం వాడికిష్టం లేదు. కారణం మీరు ముస్లింలని,'' జాఫరాలీ ముందు నివ్వెరపోయి తర్వాత నవ్వాడు.

''మీవాడేమిటిరా, దేశమే చెడిపోయింది. మా ముస్లింలను దేశద్రోహులంటుంది. బాబ్రీమసీదు తర్వాత చాలా మారిందిగదా!''

''దేశాన్ని బాగుచెయ్యటం నావల్ల కాదు. నా కొడుకుని బాగు చేసుకోవాలి. వాడికి ఎక్కిన పిచ్చ దించాలి.''

''కష్టం. నువ్వు దించలేవు''

''ఎందుకిట్లా అయిందంటావు. వాడి వయసులో మన స్నేహం ఎంత హాయిగా ఉండేది. మీ రుచులు నేనూ, మా రుచులు నువ్వూ ఎంతగా ఇష్టపడ్డాం.''

''ఎందుకో తెలిసినట్లూ ఉంటుంది. తెలవనట్లూ ఉంటుంది. పాడు రాజకీయాలని తిట్టుకోవటం తప్ప ఏమీ చెయ్యలేకపోతున్నాం.''

''మా వాడిని మార్చాలి.''

''ప్రయత్నించు.''

''మీ అమ్మాయి బురఖా వేస్తోందేం? మీ ఆవిడకు లేదుగా?''

''ఇప్పుడావిడా వేస్తోంది.''

''అలాగా,'' మూలిగాడు రామారావు.

''నేను రేప్పొద్దున వెళదాం అనుకుంటున్నా. అమ్మాయిని కొన్నాళ్లు మీ ఇంట్లో ఉంచితే ఓ నెలలో ఎక్కడన్నా గది చూసుకోవటమో, హాస్టల్లో చేరటమో చేస్తుందనుకున్నా. మరిప్పుడేం చేద్దాం. మా చుట్టాలున్నారు. వాళ్లింట్లో దింపి వెళ్లనా?'' సందేహంగా అన్నాడు.

''ఇంకా నయం. మావాడేదో తెలిసీ తెలియకా వాగితే నేను వాడి మాట పాటిస్తాననుకున్నావా? ఈనెల మా ఇంట్లోనే ఉంటుంది. నేనీ ప్రాంతంలో ఏదన్నా గది దొరుకుతుందేమో చూస్తాను. హాస్టళ్లు కూడా ఉండాలి. చూద్దాం. నువ్వింకేం మాట్లాడకు'' అన్నాడు పట్టుదలగా.

''సరే నీ ఇష్టం. నీకేదన్నా సమస్య అయితే ఫోన్ చెయ్యి. నేనొచ్చి ఏదో ఒకటి చేస్తాను,'' నీరసంగా అన్నాడు జాఫరాలి. ఇద్దరి మనసులూ బరువెక్కాయి. స్నేహపు తీపి జ్ఞాపకాల్తో మత్తెక్కాల్సిన హృదయలు బాధతో మూలుగుతున్నాయి. ఎందుకిలా? ఎందుకిలా? తెలుస్తోంది? కానీ ఏం చెయ్యలేము. ఏం చెయ్యలేమా? మన పిల్లల్ని మనం రక్షించుకోలేమా? ప్రశ్నలు, ప్రశ్నలు.

కొడుకు మీద కోపం నిలుపుకోవటం కూడా కష్టంగా ఉంది రామారావుకి. మొదట్నించీ చుట్టూ ఉన్న

మంచి తప్పు చెడు చూడని తత్త్వం అతనిది. చూసినా కళ్లు మూసుకుని అవతలకు పోయే స్వభావం. మంచీ చెడూ తెలిసినా చెడుని చూసి తలవంచుకు వెళ్లే కోట్లాది మధ్యతరగతి మనుషుల్లో అతనొకడు. మర్నాడు జాఫరాలీ వెళ్లిపోయాడు.

నసీమా బురఖా వేసుకుని తమ ఇంట్లోంచి బైటి కెళ్లటం చూస్తే వినయ్‌కి ఒంటినిండా కారం రాసు కున్నట్లుంది.

తల్లి దగ్గరకు వెళ్లి "ఈ అమ్మాయి ఎన్ని రోజు లుంటుంది" అని అడిగాడు వెనకాలే ఒస్తున్న తండ్రిని చూసుకోకుండా.

"ఎన్ని రోజులేంటి? మనింట్లోనే ఉంటుంది. నీకేంటి బాధ?"

పెద్దగా కోపం మారుమోగింది గొంతులో.

"బురఖా వేసుకుని మనింట్లోంచి అలా వెళ్లటం అసహ్యంగా ఉంది."

"పిచ్చిపిచ్చిగా వాగకు. ఆ పిల్లకిష్టం ఒచ్చినట్లు ఉంటుంది. మధ్యలో నీ ఇష్టమేమిటి?"

"అసలు నీకీ ముస్లిం స్నేహితులేంటి?"

"ఏం ఉండకూడదా- నీ పర్మిషన్ తీసుకుని స్నేహాలు చెయ్యాలా?" తండ్రి గొంతు పెద్దది చేసి కళ్లురమటంతో వినయ్ అక్కడ్నించి వెళ్లిపోయాడు.

ఆరోజు సాయంత్రం కూడా వినయ్ పెద్ద బొట్టు పెట్టుకుని వచ్చాడు. అది అలాగే ఉంచుకుని ఇల్లంతా తిరిగాడు. రామారావు దాన్ని చూసి చిరాకుపడి, అడిగి లాభం లేదని ఒదిలేశాడు. కొడుకులకు గట్టిగా ఒక విషయం చెప్పి ఆజ్ఞాపించటం రామారావుకి చేతకాదు. ఆ అవసరం లేకుండానే ఇంతకాలం గడిచింది. వాళ్ల మాటలు విని వాళ్ల కోర్కెలు తీర్చటం అలవాటైంది. పిల్లలు చదువులో ఎక్కి రావటంతో వాళ్ల మీద కోపం తెచ్చుకోవాల్సిన అవసరం, వాళ్ల గురించి దిగులు పడాల్సిన అవసరం ఏనాడూ రాలేదు. చదువు తప్ప మరే విషయం అతను పెద్దగా పట్టించుకోలేదు. చికాకైన మనసు సరి చేసుకుంటూ,

"పార్వతీ! అన్నాలు పెట్టు. అందరం కలిసి తిందాం," అని పెద్దగా అరిచాడు.

"నేనిప్పుడే తిన,"నంటూ వినయ్ అంతకంటే పెద్దగా కేకేశాడు.

"నువ్వా తినవా నసీమా," అంది పార్వతి ఉద్రిక్తంగా.

"నేను తింటానాంటీ," అంది నసీమా.

"వాడికి కూడా పెట్టు," పెద్దగా అరిచాడు రామారావు.

చివరికి నలుగురూ డైనింగ్ టేబుల్ దగ్గర చేరారు.

నసీమా తెల్లని నైటీలో నల్లని పెద్ద జుట్టు విర బోసుకుని దేవకన్యలా ఉంది.

ఆ పిల్లవైపు కన్నెత్తి చూడకుండా తింటున్న వినయ్‌ని చూస్తే చీదరేసింది రామారావుకి.

తన ముందు ఒక అందమైన అమ్మాయి కూర్చుంటే చూడకుండా ఉండేంత బండ అయ్యాడా వీడు.

నసీమా కేసి చూశాడు. ఆ పిల్ల కూడా వినయ్ కేసి చూడటంలేదు.

"వినయ్! నసీమాకు రేపాదివారం హైదరా బాదంతా చూపించరాదూ?" అన్నాడు అనునయంగా.

"ఇంకానయం," అన్నాడు వినయ్ తలెత్తకుండా.

"ఏం?"

"ఆ బురఖాను వెంటేసుకుని నేను తిరగాలా?" అన్నాడు వ్యంగ్యంగా.

నసీమాను ముందుంచుకుని అంత మొరటుగా మాట్లాడిన వినయ్‌ని చూసి ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

"నేనూ మీ అబ్బాయితో వెళ్లనంకుల్," అంది నసీమా.

"ఏం?"

"ఆ పెద్దబొట్టుతో ఉన్న మీ అబ్బాయి వెంట తిరిగితే," నసీమా ఆగింది.

రామారావు పెద్దగా నవ్వి "బాగా అంటించా వమ్మా, గుడ్. అలా ఉండాలి ఆడపిల్లలు," అన్నాడు.

వినయ్ నసీమా వంక కొరకొరా చూశాడు.

నసీమా నవ్వుతూ చూసింది.

ఆ నవ్వు చూసి వినయ్ చిత్తవ్వాలనుకున్నాడు రామారావు.

వినయ్ చిరచిరలాడుతూనే ఉన్నాడు.

"నాకే అధికారం ఉంటే వీడికీ నసీమాకు పెళ్లి చేసేవాడిని" అన్నాడు రామారావు పార్వతితో.

"మీకా అధికారం లేదులెండి" అందామె పెద్దకొడుకు పెళ్లి తల్చుకుంటూ.

"వీడిని మార్చలేమా పార్వతీ."

"నాకు నమ్మకం లేదు," పార్వతి గట్టిగానే అంది.

*

నసీమా ఇంట్లో ఉండటం తనకిష్టం లేదన్న విషయాన్ని స్పష్టం చేయటమే ధ్యేయంగా పెట్టు కున్నట్టు ప్రవర్తిస్తున్నాడు వినయ్. ఆ అమ్మాయి ఉన్న వైపు పొరపాటుగా కూడా వెళ్లడు. రాత్రుళ్లు పొద్దుబోయి ఇంటికి వస్తున్నాడు. అదేమిటని పార్వతి అడిగితే, "మీ స్నేహితులు ఇళ్లు ఆక్రమించారుగా, వాళ్లను పోనీ," అంటాడు.

ఒకరోజు రామారావు కొడుకుతో మాట్లాడాలని అతను ఒచ్చేదాకా మేలుకుని కూర్చున్నాడు.

పన్నెండు గంటలకు ఒచ్చినవాడు భోజనం చెయ్యకుండా టి.వి. పెట్టాడు.

"ఒరే నీతో మాట్లాడాలి ఇలారా," అన్నాడు రామారావు బెడ్‌రూంలోంచి.

"ఒక నిముషం నాన్నా ఈ పాట చూసి" కొడుకు సమాధానం విని తండ్రే లేచి వచ్చాడు. టి.వి.లో సినిమా పాటేదో వస్తోంది. కొడుకుతో ఎలా మాట్లాడాలా అని ఆలోచిస్తూ టి.వి.వైపు చూసిన రామారావు ఆశ్చర్యంతో అలాగే చూస్తుండిపోయాడు. పాతబస్తీ వీధుల్లో చార్మినార్ మీద హరేరామా హరేకృష్ణ అని భజన చేస్తున్న కాషాయిధారులు. రామారావుకి చాలా ఇబ్బందిగా అనిపించింది. పాట మామూలుగా ఉందిగానీ విజువల్స్ భయం పుట్టించేలా ఉన్నాయి. జాఫరాలీ చూస్తే ఏమనుకుంటాడు. వాళ్లకింకెక్కడా చోటు దొరకలేదా. చార్మినార్ మీదకెక్కి హరేరామ అంటూ భజన చెయ్యాలా? ముస్లిం విద్వేషాన్ని కక్కిన సినిమాలు కొన్ని అతనూ చూసి తిట్టుకున్నాడు. కానీ ఆ సినిమాలలో లాగానే తనింట్లో కూడా ఒక భాగం తయారవుతుందనుకోలేదు. పాట పూర్తయ్యాక వినయ్ టి.వి. కట్టేసి,

"ఏంటి నాన్నా" అంటూ ఒచ్చాడు.

రామారావుకి మాట్లాడబుద్ధి కాలేదు. టి.వి.లో చూసిన ఆ దృశ్యాలు ఎంత మూర్ఖంగా ఉన్నాయో వీడూ అంత మూర్ఖంగా ఉంటాడు. ఎవరిదీ తప్పని ఒప్పుకోరు. తన ఆఫీసులో ఇట్లాంటివాళ్లు కొందరున్నారు. వాళ్లను చూసి చిరాకుపడి దూరంగా ఉంటున్నాడు. కొడుకుతో దూరంగా ఉండటం ఎలా? మనసంతా గందరగోళమైపోయి తనవంక చిత్రంగా చూస్తున్న కొడుకుతో "ఏంలేదులే పడుకో పో," అని తనూ వెళ్లి పడుకున్నాడు. పార్వతి అలా ఊరుకోలేక పోయింది. నసీమా బురఖా తీసేస్తే కొడుకు అయిష్టం తగ్గుతుందేమోనని ఆశ పడింది. వినయ్ మాట్లాడితే బురఖా అంటున్నాడు.

ఆ రెండురోజుల తర్వాత ఓ సాయంత్రం నసీమా పెద్ద జడ విప్పి నూనె రాసి చిక్కు తీస్తూ అడిగింది పార్వతి.

"మీ అమ్మ బురఖా వేసుకునేది కాదుగా నసీమా. నువ్వెందుకు వేస్తున్నావు?"

"మేం ముస్లింలం కదా ఆంటీ."

"ఐతే"

"మీరు బొట్టు పెట్టుకుంటారుగా, అట్లాగే," సింపుల్‌గా చెప్పింది. పార్వతి మాట్లాడలేక పోయింది.

"ఇబ్బందిగా ఉండదూ?"

"లేదాంటి. అలవాటయింది," బురఖా అంటే ఫాతిమాకు ఇష్టం ఉండేది కాదు. మరి నసీమా.

"గాలాడదు గదమ్మా. అది తీసేస్తే ఏం?"

"ఎలా తీస్తాం ఆంటీ. మేం ముస్లింలం కదా బురఖా వేసుకోవాలి. లేకపోతే మీకూ మాకూ తేడా ఎలా తెలుస్తుంది?"

"మీకూ మాకూ తేడా తెలియాలా నసీమా."

"తేడా ఉందిగదా ఆంటీ. ఉన్నప్పుడు తెలియకుండా ఎట్లా?"

"నేనూ మీ అమ్మా తేడా లేకుండానే ఉన్నాం గదా"

"మా అమ్మ బొట్టు పెట్టుకోదుగదా ఆంటీ, మంగళసూత్రం ఉండదు. మా అమ్మకీ మీకూ చాలా తేడా ఉంది."

నసీమా మాటల్లో నిజం ఉందీ, లేదూ. తేడాలు ఉంటాయి. లేకుండా ఎట్లా ఉంటాయి. కానీ ఈ తేడాల్లో అప్పటికీ ఇప్పటికీ ఏదో తేడా ఉంది.

"ఏమో మీరూ మాలాగే బురఖా తీసేస్తే హాయిగా ఉంటుందనిపిస్తుంది," అనేసింది పార్వతి.

"మీరూ మాలాగే బురఖా వేసుకుంటే బాగుంటుందని నేను అనను ఆంటీ"

నసీమా మాట పార్వతికి చురుక్కుమని తగిలింది.

నసీమాకు తనకూ ఎక్కడో తేడా ఉంది. ఏంటది?

పార్వతికి తెలియటంలేదు.

మీరూ మేమూ అనుకునే స్థితి.

మీరూ మేమూ ఒకటే అనుకునే స్థితి.

మీరూ మేమూ వేరు అనుకునే స్థితి.

-ఈ మూడూ చిందరవందరగా కలిసిపోయి పార్వతికి చిక్కుముడి పడ్డాయి. నసీమా జుట్టు చిక్కు

తియ్యటం అయిపోయినా అయిపోయినట్లనిపించక దువ్వుతూనే ఉంది.

"మాలో ఏదో మార్పొచ్చినట్లు అడుగుతున్నారు. మీలో ఏ మార్పు రాలేదా ఆంటీ."

నసీమా ప్రశ్నకు పైకి చెప్పగల సమాధానంలేదు. కానీ ఒచ్చాయి. పెద్దకొడుకు అఖిల్ పెళ్లప్పుడు చాలా మార్పులొచ్చాయి. తమ పెళ్లి రిజిస్టర్ ఆఫీసులో జరిగింది. అంతా నలభై రూపాయల ఖర్చుతో. అఖిల్ పెళ్లికి తమకిష్టం లేకపోయినా కన్యాదానం పుచ్చుకున్నారు. కొడుకు పదిలక్షల కట్నం తీసుకున్నాడు. 'ఆ అమ్మాయి తల్లిదండ్రులు మీలాగా కాదు. దేవుడూ, భయం, భక్తీ ఉన్నాయి. శాస్త్రోక్తంగా పెళ్లి జరగాల్సిందే'నన్నాడు. సత్యన్నారాయణవ్రతంతో సహా అన్నీ జరిపించారు. దాని కోసం ఇంట్లోకి చిన్న దేవుడి మందిరం తెచ్చాడు అఖిల్.

దాని మీద దుమ్మూ ధూళీ పడకుండా శుభ్రం చేసి తను తృప్తి పడుతుంటే చిన్నకొడుకు పూలు పెట్టటం, దణ్ణం పెట్టటం చేస్తున్నాడు.

మార్పులు ఒచ్చాయి. రాలేదని కాదు. మరి నసీమాను ప్రశ్నించే హక్కు తనకేముంది?

"మీ ఇంట్లో కులమతాల ప్రసక్తే లేదని బాబా చెప్పాడు," పార్వతి ఆలోచనల్ని ఆపుతూ అంది నసీమా.

"ఔను. లేదు..."

"మీ అబ్బాయికి నేను మీ ఇంట్లో ఉండటం ఇష్టం లేదుగదా ఆంటీ! ఎందుకలా?"

ఉలిక్కిపడింది పార్వతి.

"అదేం కాదమ్మా. వాడికి ఇష్టం లేకపోవటం ఏంటి. వాడు నీతో సరిగా మాట్లాడటం లేదనా? వాడంతే. ఆడపిల్లలతో మాట్లాడడు," తడబడుతూ అంది.

"లేదాంటీ నాతో స్పష్టంగానే మాట్లాడాడు."

"ఏమని?"

"నేనీ ఇంట్లో ఉండటం తనకిష్టం లేదనీ. వీలైనంత త్వరగా వెళ్లిపొమ్మని."

పార్వతికి తను అక్కడే భూమిలోకి కుంగిపోతే బాగుండుననిపించింది.

"మీరూ అంకుల్ బాధపడతారని ఉన్నానుగానీ నాకూ ఇక్కడ ఉండటం ఇష్టం లేదాంటీ."

అమ్మా, నాన్నా బాధపడతారని వినయ్ ఒక్క క్షణం ఆలోచించలేదు. ఈ పిల్ల తమ గురించి ఆలోచించింది. తేడా ఎక్కడో ఉందనిపించింది పార్వతికి.

"ఔనమ్మా! నేనూ అంకుల్ నువ్వు వెళ్తే చాలా బాధపడతాం. నీకు హాస్టల్లో సీటు దొరికే వరకూ ఇక్కడే ఉండాలి," పార్వతి నసీమాను దగ్గరకు తీసుకుంది.

"నాన్న మా పిల్లలందరికీ మీ గురించి ఎంతో చెప్పాడాంటీ. మిమ్మల్ని చూడకపోయినా మా అక్క చెల్లెళ్లకు మీరంటే చాలా ఇష్టం, గౌరవం."

జాఫరాలీ మీద తమ పిల్లలకు గౌరవం కలిగించలేని తమ చేతగానితనానికి ఏడుపొచ్చింది పార్వతికి.

ఇదంతా రామారావుతో చెప్పి కళ్లనీళ్లు పెట్టుకుంది.

రామారావుకి అసలే అర్థం కావటంలేదు. ఎక్కడో తేడా వచ్చింది.

పిల్లలు చెప్పింది వినటం తప్ప, వాళ్ల ఇష్టాలు పాటించటం తప్ప తమ ఇష్టాలు వాళ్లకెందుకు చెప్ప లేకపోయారు? వాళ్ల చుట్టూ తమ ప్రపంచం నిర్మించుకోవటం తప్ప తమకంటూ ఓ ప్రపంచం లేకుండా చేసుకున్నారెందుకు? పిల్లలు రాకముందు తమకున్న ప్రపంచం ఏమయింది? దానిలోకి వాళ్లనెందుకు లాక్కోలేదు?

అంత తీరికేది, పరుగు, పరుగు.

తమకు అనాయాసంగా అలవడిన సంస్కారం పిల్లలకు అంతే సులువుగా ఎందుకలవడలేదు?

'అబ్బా అలగావాళ్లను ఇంట్లోకి తీసుకు వస్తావు. ఎట్లా చచ్చేదిరా నీతో,' అని నాయనమ్మ అన్న రోజున అన్నం మానేసి సత్యాగ్రహం చేసి మర్నాడు నాయనమ్మ చేత ఆ తన మిత్రులందరికీ అన్నం పెట్టించేవరకూ తన పంతం ఒదల్లేదు. ఇవాళ కొడుకు దగ్గర ఇంత బలహీనత ఏంటి?

పెద్దల నెదిరించినంత సులువు కాదా పిల్లల నెదిరించటం? ఆరోజు సమాజం తనకనుకూలంగా వున్నందువల్ల తనకా బలం ఒచ్చిందా? ఇవాళ సమాజం తనకాబలం ఇవ్వటంలేదా? అసలేది సమాజం. తను మర్చిపోయిన సమాజం. తను పట్టించుకోని సమాజం.

తన రెక్కల్ని పిల్లల్ని పొదువుకోటానికే ఉపయోగిస్తూ తను ఎగిరి చూడటం మర్చిపోయిన సమాజం.

ఆఫీసులో యువకుడు గుర్తొచ్చాడు రామారావుకి. మనసంతా అశాంతిమయమయింది.

అలవాటు తప్పిన అశాంతి భరించలేకపోయాడు. అందునా పిల్లల విషయంలో పిల్లలు పరీక్షల్లో సాధించే విజయాలిచ్చిన ఆనందం తప్ప ఓ అశాంతి అలవాటు తప్పింది. కొడుకు మీద కోపం అలాగే ఉంచుకోవటం కూడా అతనికి చాలా కష్టంగా ఉంది.

*

వారంరోజులు నసీమా వర్కింగ్ విమెన్స్ హాస్టళ్ల చుట్టూ తిరిగింది. ఎక్కడా ఖాళీలేదనే సమాధానమే.

"ఖాళీలున్నా నన్ను చేర్చుకోరనుకుంటానాంటీ," అంది పార్వతితో.

"అదేంటమ్మా"

"నేను ముస్లింని గదా, ఆ హాస్టళ్లలో ముస్లిం లెవరూ ఉన్నట్లు లేరు."

"ఛా - అలా పెట్టుకుంటే హాస్టళ్లు నడుస్తాయా?"

"ఎందుకు నడవవు? మెజారిటీ హిందూసేగా. ముస్లిం అమ్మాయిలు ఉద్యోగాలు చేసేదే తక్కువ. హాస్టళ్లలో ఉండేది ఇంకా తక్కువ. ముస్లిం ఆడపిల్లల కోసం ఒక హాస్టలు ఉందేమో కనుక్కోవాలి. లేకపోతే ఒకటి పెట్టాలి," స్థిరంగా అంది నసీమా.

పార్వతి డిగ్రీ గుంటూరు విమెన్స్ కాలేజీలో చదివినప్పుడు హాస్టల్లోనే ఉంది. అక్కడ పదిమంది దాకా ముస్లిం అమ్మాయిలున్నారు. అందరూ హాయిగా కలిసి ఉండేవారు. అది చెప్పి అలా అందరూ కలిసి పోవాలిగానీ వేర్వేరుగా ఉండాలా అంది.

"వేరుగా ఉంటే మాకు సీటు దొరుకుతుంది. ముస్లింలం కాబట్టి సీటివ్వలేదనే సందేహాలుండవు. వేరుగా ఉంటేనే బాగుంటుంది," ఎంత విసిగిపోయిందో నసీమా తన పట్టు వదల్లేదు. పార్వతికేం చెప్పాలో తోచలేదు. బాధపడుతున్నది నసీమా. బాధ ఎలా పోతుందా అని ఆలోచిస్తోంది. ఆ బాధ తనకు తెలియదు. తను ఆలోచించలేదు.

మరో రెండు రోజుల్లో నసీమా ఒక గది అద్దెకు తీసుకుంది. పాతబస్తీలో సుల్తాన్‌షాహీ దగ్గర.

"అయ్యో, అంత దూరాన ఎందుకమ్మా," అన్నాడు రామారావు.

"ఏమో నాకక్కడే బాగుంది అంకుల్. మా వాళ్లంతా అక్కడే ఉన్నారు."

మావాళ్లు- జాఫరాలి ఆ మాట అనుకోలేదు. నసీమా అనుకుంటోంది. జాఫరాలీ ఇరవై ఏళ్ల తర్వాత వెతుక్కుంటూ వచ్చాడు. వినయ్ నసీమా ఉన్న పదిహేను రోజులూ ముళ్ల మీద ఉన్నట్టు ఉన్నాడు. నసీమాకు అలాంటి ఫీలింగ్ కలిగించాడు.

జాఫరాలీ, నసీమాలను చూస్తే తనకు ప్రేమ. వినయ్‌కి కోపం. ఏమిటిదంతా?

ఆలోచించాల్సింది ఆలోచించాల్సినపుడు ఆలోచించలేదని రామారావుకి తోచటంలేదు.

రామారావు అతనిలాంటి అనేకమంది ఆలోచించకపోవటం వల్లనే, సమయానికి స్పందించకపోవటం వల్లనే రథయాత్రలూ, బాబ్రీమసీదులు, గుజరాత్‌లూ జరిగాయని కూడా వాళ్లకు తట్టదు. అవి వాళ్లకు రోజూ ఉదయాన్నే కాలక్షేపాన్నిచ్చే వార్తలుగా మారి చాలా కాలమయిందని కూడా గుర్తించరు. 'అరరే - అయ్యయ్యో - అబ్బా - మరీ ఘోరం' వంటి మాటలతో వాళ్ల బాధ్యత తీరిందనుకుంటారు.

అలా తీరిపోకుండా దేశంలో చెలరేగిన చిచ్చు తమ ఇంట్లో చిన్న కలవరాన్ని కలిగించవచ్చుని వాళ్లను కోరు.

అలాంటి కలవరం కలిగితే ఏం చెయ్యాలో తెలియక సతమతమవుతారు.

రామారావుకి ఆ కలవరం పదిహేనురోజుల్లోనే తప్పింది. నసీమా తన గదికి వెళ్లిపోయింది.

జాఫరాలీ ఫోన్‌లో కృతజ్ఞతలు తెలిపాడుగానీ మళ్లీ రాలేదు.

ఆ ఉదంతం గుర్తొచ్చినప్పుడు బాధపడి మళ్లీ మామూలవటం రామారావుకి అలవాటైంది.

కొడుకు మీద కోపం నిలుపుకోవటం మాత్రం చేతకాలేదు. ఏదో కుర్రవెధవ అని సర్దుకున్నాడు.

పాకిస్తాన్ క్రికెట్ టీంలోంచి వసీం అక్రమ్‌ని తీసేశారని వినయ్ సంతోషించాడు. తల్లికి సంబంధించి అతని సమస్య తీరింది. తనకు క్రికెట్ మీదే ఇష్టం పోయిందని ప్రకటించి ఊరుకుంది పార్వతి.

ఆరునెలల్లో అమెరికా వెళ్లే కొడుకుతో పేచీ ఎందుకు అనిపించింది రామారావుకి.

రామారావు మతోన్మాది కాదు. సెక్యులరిస్టు. 'సారీ జాఫరాలీ,' అనుకోవటంతప్ప ఏం చెయ్యలేడు.

*ప్రస్థానం, ఏప్రిల్-జూన్ 2003*

